ఘనంగా మిలాద్ ఉన్ నబీ

భక్తిశ్రద్ధలతో మహ్మద్ ప్రవక్త జన్మదినం

మచిలీపట్నంటౌన్: మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను నగరంలోని ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నగరంలోని జామియా మసీద్ నుంచి శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్ సాహెబ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, మైనార్టీ విభాగం నాయకులు ఎండీ మొహసిన్, షేక్ రబ్బాని, భాషా, బాషు, జామియా మసీద్ అధ్యక్షుడు ఎండీ పాషా, టీడీపీ నాయకులు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సదరుద్దీన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అబ్దుల్ మతిన్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో ర్యాలీ

చల్లపల్లి: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు శుక్రవారం చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతబోధకుడు ఈమామ్ ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం విశిష్టతను వివరించారు. పెద్దమసీదు కమిటీ అధ్యక్షుడు నసీం ఘోరీ, సెక్రటరీ అహ్మద్ జానీ, మీర్ రిజ్వాన్, అబ్దుల్ అర్షద్, మతపెద్దలు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక జామియ మజీద్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం గ్రామంలో ర్యాలీ చేసి స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు, ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

గూడూరు: మీలాద్ ఉన్ నబీ సందర్భంగా మండల కేంద్రమైన గూడూరులో శుక్రవారం ముస్లింలు భారీ సమైక్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆకులమన్నాడులో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు.



పెడనలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీలో ముస్లింలు



ర్యాలీలో పాల్గొన్న పేర్ని కిట్టు, నాయకులు



బంటుమిల్లిలో మానవహారం

అల్లా కృపతో సుభిక్షంగా జీవించాలి

పెడన: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పెడన – గుడివాడ రోడ్డులోని పెద్ద మజీద్ నుంచి మచిలీపట్నం రోడ్డులోని రైల్వేగేటు వరకు తిరిగి అక్కడ నుంచి పెద్ద మసీదు వరకు ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మత పెద్దలు అల్లా ఆశీస్సులతో ముస్లింలు అంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా బందోబస్తును పర్యవేక్షించారు.

కూటమిపై పూర్తిస్థాయిలో వ్యతిరేకత ఉంది

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

మోపిదేవి: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రం మోపిదేవిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'పై వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గరికిపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలను మోసం చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు, పోర్టులు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడుపుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం వచ్చి వాటిని పూర్తిగా పక్కన పడేసిందని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలోనే ఎదురుమొండి బ్రిడ్జి, కోడూరు రోడ్డుకు ప్రతిపాదనలు జరిగితే కూటమి నాయకులు కొత్తగా వచ్చి తామే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

యూరియా సరఫరాలో విఫలం

యూరియా కోసం రైతన్నలు తీవ్ర ఇబ్బందులతో సొసైటీల వద్ద బారులు తీరుతుంటే, అదంతా ఫేక్ న్యూస్ అని చెప్పడం కూటమి నాయకులకే చెల్లిందని సింహాద్రి విమర్శించారు. పార్టీ క్యాడర్ కలసికట్టుగా పనిచేస్తే రాబోయే ప్రభుత్వం జగనన్నదే అన్నారు. జగనన్న ప్రభుత్వంలో కేటాయించిన నిధులు నేరుగా ప్రజలకు చేరుకోగా, కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఎక్కడకు పోతున్నాయో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన నిలదీయాలని.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలకు పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కరపత్రాలు విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కారుమూరి శివనాగరాజు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఆర్టీఏ విభాగం నియోజకవర్గ కన్వీనర్ తలపుల సుధాకర్, మాజీ సర్పంచ్ పారిటిగడ్డ రాజబాబు, బూత్ విభాగం జిల్లా ఇన్‌చార్జ్ మద్దిపట్ల చిన్నా, జిల్లా సంయుక్త కార్యదర్శి, లింగం జగదీష్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ బండారు సూరిబాబు, మహిళా కార్యదర్శి పరమేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కరపత్రాలతో మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు

మచిలీపట్నంఅర్బన్: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పేర్కొన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం మచిలీపట్నంలోని శ్రీపింగళి వెంకయ్య వైద్య కళాశాల వద్ద పార్టీ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టడమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కాలేజీలు ప్రభుత్వానికి భారంగా కాకుండా ఉండేందుకు 15 శాతం సీట్లు మేనేజ్మెంట్ కోటా కింద ఉంచి, మిగిలిన సీట్లను పేద, మధ్యతరగతి విద్యార్థులకే కేటాయించారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పుడు 100 శాతం సీట్లను అమ్ముకునే జీ.ఓ తెచ్చిందని విమర్శించారు. డబ్బున్నవాడే డాక్టర్ కావాలని, పేద విద్యార్థులు మాత్రం పేషెంట్లుగా మిగలాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. పేదల ఆరోగ్యం, విద్యను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం దౌర్భాగ్యమన్నారు. వైఎస్ జగన్ ప్రారంభించిన ప్రజాహిత కార్యక్రమాలను రద్దు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యంపై రాజకీయ లాభాలు దృష్టిలో ఉంచుకుని తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ అచ్చాబా, బండెల నోబుల్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, మచిలీపట్నం నార్త్ మండల అధ్యక్షుడు మట్టా నాంచారయ్య, కార్యదర్శి గణేశన రమేష్, రైతు సంఘం నాయకుడు గడిదేశి రాజు, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, పల్లి శేఖర్, పర్లం సతీష్, యండ్రపాటి నాగేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, నాయకులు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్ నెహ్రూ, గాజుల భగవాన్, మాడపాటి వెంకటేశ్వరరావు, మొహమ్మద్ రఫీ, గడిదేశి బాలజీసు తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న పేర్ని కిట్టు, పార్టీ నాయకులు

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం

పూషడం(ఘంటసాల): ఘంటసాల మండలం పూషడం గ్రామ రహదారి పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభించారు. కొత్త మాజేరు 216 జాతీయ రహదారి నుంచి పూషడం గ్రామం వరకు రూ.1.40 కోట్లతో సుమారు నెలన్నర క్రితం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేసి నెలరోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చివరకు నెలన్నర తర్వాత సర్పంచ్ అంకం మారుతీరావు ప్రారంభించారు. ఉప సర్పంచ్ గల్లా సుబ్రహ్మణ్యం, వార్డు మెంబర్ ఆకుల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమణీయం.. రంగనాయకుని శాంతి కల్యాణం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీరంగనాయక స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి విశేష హోమాలు, పూర్ణాహుతి, స్వామివారి శాంతి కల్యాణం జరిగింది. స్వామివారి కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ మాగపాటి సత్యప్రసాద్‌బాబు పర్యవేక్షించారు.

మోపిదేవిలో ఉపాధ్యాయ దినోత్సవం

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు గరికిపాటి వెంకటేశ్వరావును శాలువతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, లింగం జగదీష్‌కుమార్, రెడ్రౌతు రాంప్రసాద్, మల్లేశ్వరి, కోసూరు కోటేశ్వరావు, తలువుల సుధాకర్, ఆది తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావును సత్కరించిన మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

ప్రథమ చికిత్స కిట్లు అందజేత

అవనిగడ్డ: ప్రయాణికులకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతోనే బస్సుల్లో ఏర్పాటు చేయడానికి ప్రథమ చికిత్స కిట్లను స్వచ్ఛందంగా అందిస్తున్నట్లు రేపల్లె నాగార్జున నర్సింగ్ హోమ్ డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య తెలిపారు. డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య తండ్రి బుచ్చయ్యచౌదరి శుక్రవారం కిట్లను అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమంతురావుకు అందించారు. డాక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ నాగార్జున నర్సింగ్ హోమ్ సౌజన్యంతో అవనిగడ్డ డిపోలోని అన్ని బస్సుల్లో కండక్టర్ వద్ద ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (టి) సీహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్ (ఎం) ఎం.దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.



డిపో మేనేజర్ హనుమంతురావుకు ప్రథమ చికిత్స కిట్లు అందజేస్తున్న డాక్టర్ కృష్ణ చైతన్య



బంటుమిల్లిలో నిమజ్జనానికి తరలిన గణపతి

ఉత్సాహంగా నిమజ్జనాలు

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో గత పది రోజులుగా జరుగుతున్న వినాయకుని నవరాత్రులు ముగిశాయి. శుక్రవారం ఉత్సాహంగా నిమజ్జనాలు నిర్వహించారు. గణనాథులను మేళతాళాలు, కనకతప్పెట్లు, డీజే పాటలతో యువకులు గణపతి బొప్పా మోరియా అంటూ కేరింతలు కొడుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఘంటసాల గ్రామంలోని శ్రీజలధీశ్వరస్వామి ఆలయం వద్ద ముస్లిం యువకుడు అక్బర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన చవితి ఉత్సవాలు మతసామరస్యాన్ని చాటింది. పలు చోట్ల ఊరేగింపులో మహిళలు, బాలబాలికలు కోలాటం ప్రదర్శించారు. -సాక్షి నెట్‌వర్క్



పెడనలో గణపతి నిమజ్జనంలో మహిళల కోలాట ప్రదర్శన



ఘంటసాలలో గణనాథుని ట్రాక్టర్ నడుపుతున్న బాషా



మోదుమూడిలో గణనాథుని ఊరేగింపులో యువకులు

ఏఐఐఈఏ పోరాట ఫలితమే జీఎస్టీ తొలగింపు

మచిలీపట్నంటౌన్: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పోరాట ఫలితంగానే ఎల్ఐసీలో వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై ఉన్న 18 శాతం జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని ఆ సంఘ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జీ.కిషోర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత దశాబ్ద కాలంగా తమ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటం విజయవంతమైందని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షుడు జే.సుధాకర్, జాయింట్ సెక్రటరీ డి.వాసు, కోశాధికారి ఎల్.రాజశేఖర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, డివిజన్ కార్యాలయ నాయకులు, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్ కుమార్

నందిగామలో ఇరువర్గాల ఘర్షణ

పెడన: మండలంలోని నందిగామ గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. సేకరించిన వివరాల మేరకు.. ఇటీవల వినాయకుని నిమజ్జనం ఊరేగింపులో బొర్రా నాగబాబుపై వైట్ కిరోసిన్ బాటిల్‌ను విసరడంతో అందులోని కిరోసిన్ నాగబాబు కళ్లలో పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై ఇరువర్గాల వారు స్థానిక జెడ్పీ హెచ్ఎస్ వద్ద రాజీ చేసుకునేందుకు శుక్రవారం రాత్రి వచ్చారు. ఈ నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకొని భూపతిన అంకాలరావు, రంగారావు అనే ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని 108లో మచిలీపట్నం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పెడన పోలీసులు ఈ సంఘటనలో ఎవరెవరున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు.

నేడు దత్త హోమాలు

చల్లపల్లి: మండలంలోని పురిటిగడ్డలో వేంచేసియున్న శ్రీకృష్ణసాయి మందిరంలో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. పౌర్ణమి రోజు చంద్ర గ్రహణం రావడంతో ఒక్కరోజు ముందుగా హోమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

యూరియా నిల్వలు నిల్

- భోగిరెడ్డిపల్లిలో రైతుల మధ్య తోపులాట
- ఆందోళనలో అన్నదాతలు

అవనిగడ్డ: సొసైటీలకు సరిపడా యూరియా సరఫరా చేయడం లేదు. బహిరంగ మార్కెట్లోనూ యూరియా దొరకడం లేదు. కొన్నిచోట్ల నాట్లు వేసి నెలరోజులు అయినా యూరియా అందకపోవడంతో పలు చోట్ల కూటమి నేతలే అధికారులపై ఎదురు తిరుగుతున్నారు. యూరియా ఎప్పుడొస్తుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.34 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో నాట్లు వేసి నెల దాటింది. ఈ ప్రాంతాల్లో తొలిదఫా ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో 500 మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఇక్కడ సరఫరాని పర్యవేక్షించారు. మచిలీపట్నం భోగిరెడ్డిపల్లిలో రైతుల మధ్య త్రోపులాట జరిగింది.

అరకొరగా సరఫరా

ఆగస్టు నాటికి 27,299 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేసినట్టు అధికారులు చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీన జీఎస్ఎఫ్‌సీ ద్వారా 243 మెట్రిక్ టన్నులు, 2న సీఐఎస్ నుంచి 1,200 మెట్రిక్ టన్నులు, గురువారం 500 మెట్రిక్ టన్నులు వచ్చాయని కలెక్టర్ బాలాజీ చెప్పారు. ఇవన్నీ నిల్వగా చూపిస్తున్నారు. వాస్తవానికి ఏరోజు సరఫరా చేసిన ఎరువులు ఆ రోజే అయిపోతున్నాయి. ఖరీఫ్‌లో సాధారణంగా రెండు, నుంచి మూడుసార్లు రైతులు ఎరువులు చల్లుకుంటారు. కొన్నిచోట్ల నాలుగు సార్లు కూడా ఎరువులు వేస్తారు. ఎరువులు వేసిన ప్రతిసారీ ఎకరాకు అరకట్ట (20 నుంచి 25 కిలోలు) యూరియా తప్పనిసరిగా చల్లుతారు. ఎకరం నుంచి రెండు ఎకరాలు ఉన్న రైతులకు ఒక కట్ట యూరియా, ఐదు నుంచి పది ఎకరాలు ఉన్న రైతులకు రెండు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. ఇవి సగం పొలానికి కూడా చాలడం లేదని రైతులు వాపోతున్నారు.



భోగిరెడ్డిపల్లిలో యూరియా కోసం రైతుల పాట్లు

రైతు పంటలకు గిట్టుబాటు ధరపై చట్టం చేయాలి

చినముత్తేవి(మొవ్వ): పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలని, అన్ని పంటలకు మద్దతు కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వై.కేశవరావు డిమాండ్ చేశారు. ఆదర్శ కమ్యూనిస్టు దంపతులు రావూరి అజయకుమార్, విజయలక్ష్మి వర్ధంతి సభలో మొవ్వ మండలం చినముత్తేవిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలు –పరిష్కార మార్గాలు అంశంపై రైతు సంఘం నాయకుడు కేశవరావు మాట్లాడుతూ అమెరికన్ ప్రభుత్వం మన దేశ పంటలకు నష్టాలు కల్పించే విధంగా టారీఫ్ విధానాలు ఉన్నాయని వాటిని వ్యతిరేకించాలన్నారు. రైతులందరికీ ఎరువులు పురుగు మందులు సబ్సిడీపై ఇవ్వాలని, రైతులకు సరిపడా యూరియా అందించాలి కోరారు. తొలుత రావూరి అజయకుమార్, విజయలక్ష్మి చిత్రపటాలకు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మద్దుల బసవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నరసింహారావు, నాయకులు రావూరి రమేష్, సీపీఎం చినముత్తేవి శాఖ కార్యదర్శి మాదాసు నాగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని భాస్కరపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇంజినీర్ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాస్కరపురం, రైలుపేట, మల్కాపట్నం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అవనిగడ్డ మండలంలో..

అవనిగడ్డ: అవనిగడ్డ మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణ నాయక్ శుక్రవారం తెలిపారు. కొత్త సబ్ స్టేషన్, అవనిగడ్డ పరిధిలోని 2, 4, 5, 7, 8, 9వ వార్డులు, బందలాయి చెరువు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గూడూరు మండలంలో..

గూడూరు: మండలంలో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.గోవిందరావు తెలిపారు. కప్పలదొడ్డి, పోసినవారిపాలెం, పిండివారిపాలెం, ఆకులమన్నాడు, కంకటావ, లేళ్లగరువు, గండ్రం, నాగవరం, రామానుజవత్తర్లపల్లి, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి కన్నబాబును పరామర్శించిన రాము



పెడన: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును కాకినాడలోని ఆయన ఇంటి వద్ద ఆ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము శుక్రవారం పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాముతో పాటు పార్టీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికపాటి వెంకట రామానాయుడు, రాజులపాటి అచ్చుతరావు తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి విశ్రాంత ఉపాధ్యాయుడి సహకారం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): గురు పూజోత్సవం నాడు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందని విశ్రాంత ఉపాధ్యాయుడు రావి దుర్గా సుధాకరరెడ్డి అన్నారు. పెదకళ్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 20 వేలతో మంచి నీటి ట్యాంకు, పైప్‌లైన్ మరమ్మతులు, పాఠశాల డ్రెయినేజీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం మోహనరావు పాఠశాల అభివృద్ధికి సాయం చేసిన దాత సుధాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తకు నివాళి



గంజివానిపాలెం(మోపిదేవి): మండలంలోని గంజివానిపాలెం దళితవాడకు చెందిన బూసి దిలీప్(32) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం మృతిని ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, నందిగం అభిషేకరావు, లింగం జగదీష్‌కుమార్ ఉన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



నాగాయలంక: గ్రామంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 108 శ్రీలక్ష్మీ దేవి కలశములకు సామూహిక కుంకుమ పూజను వైభవంగా నిర్వహించారు. పూజలో కూర్చున్న మహిళలకు చిట్టా నారాయణరావు వితరణతో బంగారు పూత కలిగిన వెండి శ్రీలక్ష్మీదేవి రూపులను బహూకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

నంగేగడ్డ(నాగాయలంక): గ్రామంలోని వినాయక ఉత్సవాల మండపంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



కృత్తివెన్ను: కృత్తివెన్ను శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించారు. చైర్మన్‌గా చేకూరి వెంకట్రావు, పాలకవర్గ సభ్యులుగా దాసరి వెంకటశ్రీనివాస్, ఈదా సోదామని, మోక దుర్గనాగజ్యోతి, బాలం శ్రీనివాసరావు, తమ్ము లక్ష్మి, బాడిత నాగబాబు, నూతిలపాటి రేవతి, మల్లువలసల మహాలక్ష్మి, ఎక్స్ అఫియోషియో మెంబర్‌గా అర్చకుడు కోట మురళీకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాలక మండలిని అభినందించారు.

కోదండ రామాలయం ట్రస్ట్ బోర్డు

గూడూరు: మండలంలోని ఆకులమన్నాడులో శ్రీకోదండ రామాలయం ట్రస్ట్ బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. బడే వీరబాబు కమిటీ చైర్మన్‌గా 8 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎజ్జు శివాజి, గూడూరు డీసీ చైర్మన్ పోతన స్వామి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో శుక్రవారం సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దోమల నివారణకు ఎబెట్ పిచికారి చేయించారు. ఈఓ అబ్దుల్ నయూమ్, ఏఎన్ఎం మల్లేశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.